క్లుప్తంగా

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో హరేకృష్ణ, హరేరామ నామస్మరణతో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారి లీలలు, మహిమలను వర్ణిస్తూ భక్తులు భజనలు, గీతాలాపన చేశారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



యాత కుమ్మరిపాలెంలో ప్రచారం చేస్తున్న భక్తులు

తగరపువలస: సిద్ధాంత ఆదికర్త, ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుని శిష్యులు ఆదివారం త్రైత సిద్ధాంత భగవద్గీతపై భీమిలి పరిధిలో ఆదివారం ప్రచారం చేశారు. యాత కుమ్మరిపాలెం, బిల్లలమెట్ట, గొల్లల పాలెంలో ఇంటింటికీ వెళ్లి తెలుగు నెలల త్రైత సిద్ధాంత క్యాలెండర్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రావణ అక్షయ్ మాట్లాడుతూ వంద రకాల త్రైత సిద్ధాంత ఆధ్యాత్మిక గ్రంథాలు ప్రజల కోసం అందుబాటులో ఉంచామన్నారు. కార్యక్రమంలో అక్షయ్, ప్రసాద్, ఆదినారాయణ, ఆదమ్మ, బాలకృష్ణ, మీనా, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ లీగ్ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న క్లబ్ సభ్యులు

కొమ్మాది: రోటరీ క్లబ్, వైజాగ్ మెట్రో ఆధ్వర్యంలో ఏప్రిల్ 1 నుంచి పోర్టు స్టేడియంలో నిర్వహించనున్న రోటరీ క్రికెట్ లీగ్ పోస్టర్‌ను తిమ్మాపురంలో గల డి.రామానాయుడు ఫిల్మ్ స్టూడియోలో రోటరీ జిల్లా పూర్వ గవర్నర్లు మడిపిల్లి రామారావు, డి.వి.రాజు, రాజారెడ్డి ఆదివారం ఆవిష్కరించారు. 15 క్లబ్‌లకు సంబంధించిన 7 జట్లు పాల్గొన్నాయి. కార్యక్రమంలో రోటరీ క్లబ్ మెట్రో అధ్యక్షులు సునీత లావణ్య, కార్యదర్శి గాయత్రి, వ్యవస్థాపక అధ్యక్షుడు మిథిలి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

30న సీతారాముల కల్యాణోత్సవం



సీతారాముల కల్యాణ ఉత్సవమూర్తులు

సింహాచలం: శ్రీరామ నవమిని పురస్కరించుకుని ఈనెల 30న సింహగిరిపై పురాతన రామాలయంలో సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహిస్తున్నట్టు వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఈవో వి.త్రినాథరావు ఆదివారం తెలిపారు. ఆరోజు ఉదయం 10.30 గంటలకు ఆలయ ప్రాంగణంలో కల్యాణం నిర్వహించడం జరుగుతుందన్నారు. భక్తులంతా కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరారు. అలాగే సింహగిరిపై రాజగోపురం వద్ద ఉన్న కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలోని సీతారాముల సన్నిధిలో కూడా కల్యాణ మహోత్సవం ఉదయం 10.30గంటల నుంచి జరుగుతుందని పేర్కొన్నారు.

ప్రమాదకరంగా కాజ్‌వేలు



కేథరిన్ విద్యాసంస్థల సమీపంలో గెడ్డపై రక్షణ గోడ లేని కాజ్‌వే



కొత్త మూలకుద్దు ఉప్పు గల్లీల వద్ద గెడ్డపై రక్షణ గోడలు లేని ఇరుకైన కాజ్‌వే

తగరపువలస: భీమిలి మండలం కొత్త మూలకుద్దు రహదారిలో రెండు చోట్ల గెడ్డలపై కాజ్‌వేలకు రక్షణ గోడలు లేకపోవడంతో వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భీమిలి రోడ్డు నుంచి కొత్త మూలకుద్దు చేరుకునే మార్గంలో గోస్తనీ నదిపై గెడ్డలు ఉన్నాయి. వర్షాకాలంలో నీరు ఈ కాజ్‌వేల పైనుంచి ప్రవహిస్తుంది. వీటిలో కేథరిన్ విద్యాసంస్థలకు అనుకుని పాడవైనది, ఉప్పుగల్లీల వద్ద మరొక కాజ్‌వే ఉన్నాయి. గతంలో కాజ్‌వేల నిర్మాణం జరిగే సమయంలో ఈ రెండింటిపై ఇరువైపులా రక్షణగా సిమెంట్ స్తంభాలు ఏర్పాటు చేశారు. కాలక్రమేణా వీటిపై సిమెంట్ స్తంభాలను వాహనాలు ఢీకొనడంతో పూర్తిగా శిథిలమైపోయాయి. పగలంతా బాగానే ఉన్నప్పటికీ రాత్రివేళ ఈ మార్గంలో చీకటిగా ఉండటంతో కాజ్‌వేలపై ప్రయాణం స్థానికులకు ఆందోళన కలిగిస్తోంది. ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా వాహనాలు గెడ్డలోకి దూసుకుపోయే ప్రమాదం ఉంది.

ఈ గ్రామానికి ఆటోలు, ద్విచక్ర వాహనాలు తప్ప మరే ప్రయాణ సాధనాలు లేనందున 24 గంటలూ వీటిపై స్థానికులు రాకపోకలు సాగిస్తుంటారు. అందువల్ల కాజ్‌వేలపై రక్షణగోడలు లేదా సిమెంట్ స్తంభాలను పునరుద్ధరించాలని మూలకుద్దు వాసులు కోరుతున్నారు.

రక్షణ గోడలు లేక ఇబ్బందులు

పద్మనాభం: మండలంలోని విజయరాంపురం గ్రామ ప్రవేశంలో బాందేవుపురం – అలమండ ఆర్ అండ్‌బీ రోడ్డుకు అనుసంధానంగా నిర్మించిన కల్వర్టుపై రక్షణ గోడలు శిథిలమయ్యాయి. ఈ మార్గంలో మండలంలోని గంధవరం, బాందేవుపురం, కొత్త కొవ్వాడ గ్రామాలకు విజయనగరం జిల్లా జామి మండలం అలమండ ప్రాంతాలకు వాహనచోదకుల రాకపోకలు సాగిస్తుంటారు. రక్షణ గోడలు లేకపోవడంతో వాహనాల డ్రైవర్లు, ద్విచక్ర వాహనచోదకులు ఏమరపాటుగా ఉంటే ప్రమాదాలకు గురై వాహనాలు గెడ్డలోకి పల్టీకొట్టేస్తున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి కల్వర్టుపై రక్షణ గోడలు నిర్మించాలని ప్రయాణికులు కోరుతున్నారు.



విజయరాంపురం వద్ద రక్షణ గోడలు లేని కల్వర్టు

వివాహిత ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న నాగలక్ష్మి

తగరపువలస: భీమిలి మండలం తాళ్లవలస పంచాయతీ ఎరుసుపేటకు చెందిన బోయి నాగలక్ష్మి అనే మహిళ స్థానికంగా నివసిస్తున్న అప్పయ్యమ్మ, నరసింగరావు వేధింపులు తాళలేక ఆదివారం ఉదయం దోమల నివారణ లిక్విడ్ తాగి ఆత్మహత్యకు యత్నించింది. నాగలక్ష్మి భర్త దుర్గారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... నాగలక్ష్మి మధ్యవర్తిగా పలువురి నుంచి డబ్బులు వసూలు చేసి అప్పయ్యమ్మ వద్ద చీటీలు వేసింది. ఇందులో కొన్ని రూ.లక్షల చీటీల సొమ్ము నిర్వాహకురాలైన అప్పయ్యమ్మ దగ్గర నుంచి రావాల్సి ఉంది. చీటీల డబ్బులు రావాల్సిన వారు నాగలక్ష్మిపై ఒత్తిడి తీసుకొస్తున్నారు. దీంతో అప్పయ్యమ్మను డబ్బులు అడగడంతో ఆమెతోపాటు కుటుంబ సభ్యులు నిత్యం నాగలక్ష్మి ఇంటిపై దాడులకు దిగుతూ తీవ్ర పదజాలంతో దూషిస్తున్నారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన నాగలక్ష్మి ఇంట్లో ఆత్మహత్యకు యత్నించింది. బాధితురాలి కుటుంబ సభ్యులు సమాచారాన్ని 100 నంబరు ద్వారా భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేసి తగరపువలసలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్సకు తరలించారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

తీరంలో విద్యుత్ వెలుగులు



విద్యుత్ అలంకరణలో తొట్లకొండ ముఖద్వారం

కొమ్మాది: జి – 20 సదస్సు నేపథ్యంలో తీర ప్రాంతం వివిధ రంగుల విద్యుత్ కాంతుల్లో ఆకర్షణీయంగా ముస్తాబైంది. గుడ్లవానిపాలెం పార్కు, సాగర్‌నగర్ బీచ్, రుషికొండ బీచ్, ఇస్కాన్ టెంపుల్, తొట్లకొండ ప్రాంతాల్లో విద్యుత్ వెలుగులు పర్యాటకులను, ప్రయాణికులను ఆకర్షిస్తున్నాయి. వీటితో తీర ప్రాంతంలో పండగ వాతావరణం నెలకొంది.

‘చలో ఢిల్లీ’ పోస్టర్ల ఆవిష్కరణ



చలో ఢిల్లీ పోస్టర్లు విడుదల చేస్తున్న సిటు నాయకులు

తగరపువలస: ప్రధాని మోడీ ప్రభుత్వ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఏప్రిల్ 5న తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ భీమిలి డివిజన్ సిటు నాయకులు ఆదివారం పోస్టర్లు విడుదల చేశారు. చిట్టివలసలో జరిగిన కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు, కనీస పింఛన్ రూ.10వేలు అమలు చేయాలన్నారు. కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ సవరణ బిల్లు – 2022ను రద్దు చేయాలని కోరారు. ఎరువుల సబ్సిడీని పెంచి ఉపాధి హామీ పథకానికి బడ్జెట్‌లో కేటాయింపులు రూ.2 లక్షల కోట్లకు పెంచాలన్నారు. ఈ పథకాన్ని పట్టణాలకు కూడా విస్తరించి రూ.600 వేతనంతో 200 పనిదినాలు కల్పించాలని కోరారు. కౌలు రైతులను గుర్తించి కేంద్ర ప్రభుత్వం పరిహారం ఇవ్వాలన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించి బడ్జెట్‌లో ప్రజా పంపిణీ వ్యవస్థకు రూ.3 లక్షల కోట్లు కేటాయించాలన్నారు. ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణకు స్వస్తి పలికి అటవీహక్కు చట్టాన్ని అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆర్.ఎస్.ఎన్.మూర్తి, రవ్వ నరసింగరావు, ఎస్.అప్పలనాయుడు, డి.బాబాజీ, ముగడ ఈశ్వరరావు, అప్పికొండ పోలయ్య, పద్మావతి, సీహెచ్.అప్పారావు, కర్రి రాము, పద్మ, చిన్ని తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవులకు ఎస్సీ రిజర్వేషన్ వద్దు

సింహాచలం: క్రైస్తవులకు ఎస్సీ రిజర్వేషన్ కల్పించేందుకు అసెంబ్లీలో ప్రవేశపెట్టిన తీర్మానాన్ని వ్యతిరేకిస్తున్నామని ఉత్తరాంధ్ర ఎస్సీ, ఎస్టీ యాక్షన్ ఫోరమ్ ప్రతినిధులు అన్నారు. సింహాచలంలోని ఓ ప్రైవేటు కల్యాణమండపంలో ఉత్తరాంధ్ర ఎస్సీ, ఎస్టీ యాక్షన్ ఫోరమ్ నాయకులు మీడియా సమావేశం ఏర్పాటు చేశారు.ఎస్సీ, ఎస్టీ యాక్షన్ ఫోరమ్ జాతీయ అధ్యక్షుడు మీసాల రవీంద్ర, ఉత్తరాంధ్ర అధ్యక్షుడు చొక్కాకుల రాంబాబు మాట్లాడారు. క్రైస్తవులు విచ్చలవిడిగా మత ప్రచారం చేస్తూ హిందువులపై దౌర్జన్యాలు చేస్తున్నారని ఆరోపించారు. రిజర్వేషన్ బిల్లు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ సీహెచ్ రమణబాబు, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు మాధవిలత, జిల్లా కార్యదర్శి బొత్స ప్రవీణ్, విశ్వ హిందూ పరిషత్ మఠ మందిర్ రాష్ట్ర అధ్యక్షుడు పూడిపెద్ది శర్మ తదితరులు పాల్గొన్నారు.

చిత్తశుద్ధి గల నాయకుడు సూర్యనారాయణ



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి

తగరపువలస: చిట్టివలస జ్యూట్‌మిల్లులో కార్మికునిగా పనిచేస్తూనే సీపీఐ కార్యకర్తగా సంఘ కార్యకలాపాల్లో క్రమం తప్పకుండా కానూరి సూర్యనారాయణ పాల్గొనేవారని ఆ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణ మూర్తి అన్నారు. చిట్టివలస జ్యూట్‌మిల్లు కల్యాణ మండపంలో సూర్యనారాయణ సంస్మరణ సభ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిత్తశుద్ధి, నిబద్ధతతో పనిచేసే సూర్యనారాయణ నాయకత్వం కోసం ఏనాడూ ఆరాటపడలేదన్నారు. అదే సమయంలో నాయకత్వంలోని పొరపాట్లను నిలదీసేవారన్నారు. ఆయన మృతి సీపీఐకి, ఏఐటీయూసీకి నష్టమన్నారు. సంస్మరణ సభలో సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు, అల్లు బాబూరావు, కొండపు ఈశ్వరరావు, కానూరి రాంబాబు, తూతిక సోమరాజు, చిల్ల రాంపైడి, నూలు ఆదినారాయణ, మావూరి వీర్రాజు, దుంప శ్రీను, ఇమంది పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

రాకపోకలకు అడ్డంగా గ్రావెల్



సంతపేట రెడ్డివీధిలో రహదారిపై అడ్డంగా గ్రావెల్

తగరపువలస: జీవీఎంసీ రెండో వార్డు సంతపేట రెడ్డివీధి రహదారిపై మూడు రోజులుగా గ్రావెల్ వేసి ఉంచడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. ద్విచక్ర వాహనాలు, ఆటోలు, చెత్త తరలించే వాహనాలు ఈ గ్రావెల్‌ను దాటుకుని వెళ్లలేక వెనక్కు మళ్లుతున్నాయి. కొందరు ద్విచక్ర వాహనదారులు ఇక్కడ బోల్తా పడుతున్నారు. జీవీఎంసీ, సచివాలయ సిబ్బంది పట్టించుకోకపోవడంతోనే రహదారులపై ఇష్టం వచ్చినట్టు గ్రావెల్ పోస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. వీటిని తొలగించే ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

మండల విద్యాశాఖ కార్యాలయానికి నూతన శోభ



ఆధునికీకరించిన మండల విద్యాశాఖ కార్యాలయం

పద్మనాభం: మండల విద్యాశాఖ కార్యాయాన్ని రూ.10 లక్షల మండల పరిషత్ నిధులతో ఆధునికీకరించడంతో నూతన శోభను సంతరించుకుంది. అన్ని పనులు పూర్తి చేసుకుని ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. 30 ఏళ్ల కిత్రం నిర్మించిన ఈ కార్యాలయ భవనం వర్షాలకు కారిపోతుంది. మండలంలోని 48 ప్రాథమిక, రెండు ప్రాథమికోన్నత, తొమ్మిది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ఒక కస్తూర్బా విద్యాలయం ఉన్నాయి. ఈ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, జగనన్న విద్యా కానుకలైన యూనిఫారం, బూట్లు, స్పోర్ట్సు మెటీరియల్ ఈ కార్యాలయానికి వస్తుంటాయి. కార్యాలయం వర్షాలకు కారిపోవడంతో పాఠ్య పుస్తకాలు తడిసిపోయేవి. గత ప్రభుత్వంలో ఎవరూ ఈ కార్యాలయాన్ని పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆదేశాలతో మండల విద్యాశాఖ కార్యాలయం ఆధునికీకరణకు శ్రీకారం చుట్టారు. ఇందుకోసం మండల పరిషత్ నిధులు రూ.10 లక్షలు వెచ్చించారు. గతంలో కార్యాలయానికి వెళ్లే రహదారి రాళ్లు తేలిపోవడంతో మండల పరిషత్ నిధులు రూ.1.50 లక్షలు వెచ్చించి సిమెంటు రోడ్డు వేశారు.

పెట్రోల్ బంక్‌లో యువకుల రగడ

ఆరిలోవ: జాతీయ రహదారి పక్కన ఎండాడ వద్ద పెట్రోల్ బంక్‌లో హడావిడి జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. ఆదివారం సాయంత్రం ఎండాడకు చెందిన ముగ్గురు యువకులు ద్విచక్ర వాహనంపై బంక్‌కు వెళ్లారు. అక్కడ పెట్రోల్ కొట్టించుకొని డబ్బులు ఫోన్‌పే చేస్తామన్నారు. పెట్రోల్ కొట్టే బాయ్ ఫోన్‌పే లేదని చెప్పడంతో వారి మధ్య వాదన జరిగింది. ఈ విషయం గమనించిన బంక్ యజమాని అక్కడికి చేరుకుని బైక్‌లో వేసిన పెట్రోల్‌కు సరిపడా డబ్బులు ఇవ్వాల్సిందేనని చెప్పారు. దీంతో ఆగ్రహించిన ఆ యువకులు గొడవకు దిగారు. బంక్ క్యాబిన్ అద్దాలు పగలుగొట్టారు. బంక్ యజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు గొడవకు దిగిన ముగ్గురు యువకులను ఆరిలోవ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

వైభవంగా నారసింహుడికి ఆర్జిత సేవలు



కంకణధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఉదయం 7నుంచి 8గంటల వరకు స్వర్ణపుష్పార్చన నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కల్యాణ మండపంలో వేదికపై అధిష్టంపజేశారు. 108 స్వర్ణసంపెంగ పుష్పాలతో అష్టోత్తరశత నామావళి పూజ చేశారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఆలయ పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ కనకరాజు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఘనంగా అప్పన్న నిత్యకల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్యకల్యాణం ఘనంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంప జేసి కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం,జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం చేశారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం , శేషవస్త్రాలు అందజేశారు.

శ్మశానవాటికలో వెయిటింగ్ హాలు ప్రారంభం



శ్మశానవాటికలో వెయిటింగ్ హాలు వద్ద ఫ్రెండ్స్ హెల్పింగ్ హేండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు

తగరపువలస: చిట్టివలస ఫ్రెండ్స్ హెల్పింగ్ హేండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు గోస్తనీ నది తీరంలోని శ్మశాన వాటికలో రూ.2 లక్షలతో నిర్మించిన వెయిటింగ్ హాలును ఆదివారం వినియోగంలోకి తీసుకొచ్చారు. చిట్టివలస శ్మశానవాటికకు అంతిమయాత్రకు వచ్చేవారికి నిలువనీడ లేకపోవడంతో అసోసియేషన్‌కు చెందిన 45 మంది ప్రతినిధులు వెయిటింగ్ హాలు నిర్మించారు. 14 గ్రామాల ప్రజల ప్రయోజనార్థం నిర్మించినట్టు తెలిపారు. సేవా కార్యక్రమాల్లో భాగంగా వేసవిలో అసోసియేషన్ తరఫున మజ్జిగ చలివేంద్రాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు.

హోమియో మందుల పంపిణీ



రోగిని పరీక్షిస్తున్న వైద్యులు

భీమునిపట్నం: స్థానిక కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో డైరెక్టర్ కలిగొట్ల శ్రీరామచంద్ర మూర్తి పర్యవేక్షణలో ఉచిత హోమియో వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా 105 మంది రోగులను డాక్టర్లు టి.జగన్నాథరావు, టీజే మోహన్ పరీక్షించి అవసరమైన మందులు అందించారు. శిబిరంలో ఫౌండేషన్ ప్రతినిధులు కె.ఎస్.ఎన్.మూర్తి, కె.చంద్రశేఖర్, కె.భానోజీరావు, కె.శ్రీనివాసరావు, సభ్యులు వి.లక్ష్మణరావు, వి.శ్రీనివాసరావు, ఎం.శంకర్ పాల్గొన్నారు.

మహిళా మార్టు నిర్మాణ పనులు వేగవంతం



నిర్మాణంలో ఉన్న మహిళా మార్టు భవనం

ఆనందపురం : మండల కేంద్రం వద్ద ఏర్పాటు చేస్తున్న మహిళా మార్టు నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ఆధ్వర్యంలో డ్వాక్రా మహిళలను భాగస్వాములను చేస్తూ వ్యాపారం నిర్వహించడం కోసం మహిళా మార్టు ఏర్పాటు చేస్తున్నారు. స్థానిక పోలీస్ స్టేషన్ పక్కన పాత ప్రభుత్వ భవనం స్థానంలో కొత్తగా నిర్మిస్తున్నారు. పనులు దాదాపు పూర్తి అవుతున్నాయి. మండలంలో 15,300 మంది డ్వాక్రా సభ్యులు ఉండగా ఒక్కొక్కరి నుంచి రూ.310 చొప్పున నిధులు సమీకరించారు. అందులో భవన నిర్మాణానికి రూ.100 చొప్పున కేటాయించగా వ్యాపారంలో పెట్టుబడి కోసం రూ.210లు కేటాయిస్తున్నారు. మొత్తంగా భవన నిర్మాణానికి రూ.15 లక్షలు, వ్యాపారానికి రూ.35 లక్షలు చొప్పున వినియోగించనున్నారు. ఇక్కడ మార్ట్‌లో డ్వాక్రా మహిళల ఉత్పత్తులతోపాటు రోజువారీ ఇళ్లల్లో అవసరమయ్యే వస్తువులను కూడా విక్రయిస్తారు. వ్యాపారంలో వచ్చే లాభాలను సభ్యులకు వాటాలుగా అందజేస్తారు. నిర్మాణం పూర్తి అయితే వ్యాపార కార్యకలాపాలు ప్రారంభిస్తామని ఏపీఎం నాగ భూషణం చెప్పారు.

పబ్లిక్ డిమాండ్

మారికవలసలో చిల్లర దొంగల జోరు



చిల్లర దొంగతనాలు జరుగుతున్న 116, 117, 118 బ్లాకుల ఏరియా

తగరపువలస: జీవీఎంసీ మధురవాడ జోన్ మారికవలస రాజీవ్ గృహకల్ప న్యూ బిల్డింగ్స్ (వైట్) 116, 117, 118 బ్లాకుల వద్ద చిల్లర దొంగలు చీకటివేళ చెలరేగిపోతున్నారు. గత సోమవారం రాత్రి 1.30 గంటల సమయంలో అక్కడ చెట్ల కింద పార్కింగ్ చేసిన 10 ద్విచక్ర వాహనాల నుంచి పెట్రోల్, బ్యాటరీలు దొంగిలించి ఏకంగా సీట్లు, వైర్లు కట్ చేశారు. ఆటోలపై కూడా తమ ప్రతాపం చూపించారు. స్థానికులు పట్టుకోవాలని ప్రయత్నిస్తే తృటిలో తప్పించుకున్నారు. ఈ ప్రాంతంలో అంతగా వీధిదీపాలు పనిచేయడం లేదు. వీధి దీపాలు ఉన్న చోట కూడా చెట్ల మాటున ఉండిపోవడంతో అంధకారంగా ఉంటుంది. దొంగతనాలపై పీఎం పాలెం పోలీసులు నిఘా పెట్టి తమ ఆస్తులకు రక్షణ కలిగించాలి. వెలగని వీధిదీపాలను జీవీఎంసీ అధికారులు పునరుద్ధరించాలి.

– జి.నూకరాజు, మారికవలస, మధురవాడ జోన్

రిజిస్ట్రేషన్లకు పరిమిత స్పందన

మధురవాడ: ఆర్థిక సంవత్సరం ముగింపు నేపథ్యంలో ఆదివారం కూడా మధురవాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పనిచేసింది. ఈ సందర్భంగా ఇక్కడ రిజిస్ట్రేషన్లకు కక్షిదారుల నుంచి పరిమిత స్పందన లభించింది. సబ్ రిజిస్ట్రార్లు ఎస్.మోహన్‌రావు, వెంకయ్యనాయుడు ఆధ్వర్యంలో 5 డాక్యుమెంట్లు మాత్రమే రిజిస్ట్రేషన్‌కాగా రూ.2.21 లక్షల ఆదాయం వచ్చిందని సిబ్బంది చెప్పారు.

నిర్లక్ష్యపు పొగ..!

ఫుట్‌పాత్, రోడ్డుపై గడ్డి తగలబెట్టిన రెస్టారెంట్ నిర్వాహకులు



ఫుట్‌పాత్‌పై కాలుతున్న గడ్డికుప్ప

కొమ్మాది: జి – 20 సదస్సు నేపథ్యంలో ఆర్కే బీచ్ నుంచి భీమిలి తీరం వరకు కోట్ల రూపాయల వ్యయంతో సుందరీకరణ పనులు చేపడుతున్నారు. ఇందులో భాగంగా కొత్తగా రోడ్ల నిర్మాణం, డివైడర్లు, ఫుట్‌పాత్‌లకు పెయింట్స్, వివిధ రకాల పూలమొక్కలు ఏర్పాటు చేస్తున్నారు. వీటిపై ఎప్పటికప్పుడు కలెక్టర్, జీవీఎంసీ కమిషనర్ పర్యటిస్తూ ఏర్పాట్లు పరిశీలిస్తున్నారు. అయితే దీనికి విరుద్ధంగా భీమిలి బీచ్ రోడ్డులోని తిమ్మాపురంలో గల ఓ రెస్టారెంట్ నిర్వాహకులు రోడ్డు మీదే గడ్డి కుప్పలను తగలబెట్టారు. ఈ రెస్టారెంట్ రీ మోడలింగ్‌లో భాగంగా పది రోజుల క్రితం ఇక్కడ పందిర్లకు ఉన్న గడ్డిని తొలగించి ఫుట్‌పాత్‌లపై పడేశారు. దీంతో ఇటుగా రాకపోకలు సాగిస్తున్న వారిపై ఈ గడ్డి గాలికి ఎగిరి వాహనాలపై పడుతోందని స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. ఆదివారం ఉదయం ఈ గడ్డికుప్పలకు నిర్లక్ష్యంగా అక్కడే నిప్పు అంటించారు. దీంతో సుందరంగా ఉన్న ఫుట్‌పాత్‌లు, రోడ్లపై బూడిద దర్శనమిచ్చింది. అంతేకాకుండా కొత్తగా నిర్మించిన రోడ్డు ధూళితో అందవికారంగా తయారయ్యింది. ఉదయం నుంచి మంటలు వ్యాపిస్తున్నప్పటికీ అధికారులు ఎవరూ స్పందించకపోవడం విశేషం. జీవీఎంసీ సిబ్బంది ఇటుగా వెళ్తున్నప్పటికీ చూసీచూడనట్లు వ్యవహరించడం గమనార్హం.